ప్రభుత్వ సహకారంతో పనులు: శ్రీగణేష్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్

రాంగోపాల్‌పేట్: కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయ పునరుద్ధరణ పనులు ప్రభుత్వ సహకారంతో వేగంగా పూర్తి చేస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మంగళవారం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచలోహ విగ్రహాన్ని తయారు చేయిస్తున్నామని చెప్పారు. అమ్మవారి దగ్గర కొంత మంది రాజకీయాలు చేస్తూ బస్తీవాసులను తప్పుదోవ పట్టిస్తున్నారని, అలాంటి వారికి ఎలా బుద్ధిచెప్పాలో అమ్మవారు చూసుకుంటారని అన్నారు. బస్తీ ప్రజలు, భక్తులు ఇలాంటి వారి మాయలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్ ముదిరాజ్, బల్వంతరెడ్డి, సంకి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విధ్వంసం దురదృష్టకరం: తలసాని

కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ విధ్వంసం తదనంతరం పరిణామాలు దురదృష్టకరమని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి ఘటనలు తాను ఎప్పుడూ చూడలేదని, కానీ ప్రజలు సంయమనం పాటించాలని అన్నారు. మంగళవారం ఆయన వేదపండితులు, స్థానిక నాయకులతో కలిసి దేవాలయాన్ని సందర్శించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం, శాంతి పూజలు చేయిస్తామని అన్నారు. బస్తీ వాసులందరూ రాజకీయ ప్రమేయం లేకుండా అమ్మవారికి బోనాలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లికార్జున్ గౌడ్, ఆకుల రూప, నాయకులు నాగేందర్, సత్యనారాయణ, వెంకటేష్ రాజు పాల్గొన్నారు.

ప్రేరేపించినవారిని శిక్షించాలి: ఎమ్మెల్యే రాజాసింగ్

అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారితోపాటు ప్రేరేపించిన వారిని కూడా కఠినంగా శిక్షించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులను అడిగి సంఘటన గురించి తెలుసుకున్నారు. ఘటన అనంతరం అమ్మవారి దర్శనం కోసం వేచి చూస్తుంటే పోలీసులు గృహనిర్బంధం చేస్తున్నారని ఆయన అన్నారు.

పునరుద్ధరణ చకచకా

- దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ దేవాలయ పనులు
- అమ్మవారి శుద్ధీకరణ, నిత్యపూజలు

రాంగోపాల్‌పేట్: కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయ పునరుద్ధరణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 14వ తేదీన ఓ దుండగుడు అమ్మవారి దేవాలయంపై దాడి చేసి విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై హిందూ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేశాయి. స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లడంతో ప్రభుత్వం స్పందించింది. ఘటన జరిగిన మరుసటి రోజు నుంచి స్థానికులు, అనువంశిక ధర్మకర్తల ఆధ్వర్యంలో అమ్మవారి శుద్ధీకరణ, కలశ స్థాపన, నిత్య పూజలు జరుగుతున్నాయి. పలువురు రాజకీయ పార్టీల నాయకులు, దాతలు ఆలయ పునర్నిర్మాణానికి ముందుకు వచ్చినా ప్రభుత్వం మాత్రం దేవదాయ శాఖ నుంచి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టాలని నిశ్చయించింది. దీంతో మంగళవారం దేవదాయ శాఖ అదనపు కమిషనర్ జ్యోతి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, స్థానికులు కలిసి అమ్మవారి ఆలయ పునరుద్ధరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.


అమ్మవారి ఆలయ పునరుద్ధరణ పనులను ప్రారంభిస్తున్న అదనపు కమిషనర్ జ్యోతి

అన్ని పనులు పూర్తి చేస్తాం: జ్యోతి

దేవాలయ పునరుద్ధరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ దేవాలయం దేవాదాయ శాఖ పరిధిలో లేనందున ఇతర దేవాలయాల నిధులు వెచ్చించి పనులు చేపడుతున్నాం. స్థపతి సూచనల మేరకు, ఆగమశాస్త్రం ప్రకారం పనులు సాగుతున్నాయి. అమ్మవారి మూల విగ్రహానికి ఎలాంటి నష్టం జరగలేదు. ఉత్సవ విగ్రహం మాత్రమే ధ్వంసమైంది. అయితే స్థానికుల కోరిక మేరకు పంచలోహ విగ్రహాన్ని తయారు చేయిస్తున్నాం. దేవాలయం లోపల ఫ్లోరింగ్, ప్రధాన గేటు, గర్భగుడి గేటు మరింత పటిష్ఠంగా ఏర్పాటు చేస్తాం. దేవాలయం పైన ఉన్న అమ్మవారి విగ్రహం, సాలారం నిర్మాణం చేపడతాం. పది రోజుల్లో అన్ని పనులు పూర్తి చేస్తాం.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.39, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, బజ్జీ మిర్చి 65, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 38, పందిరి బీర 50, క్యాబేజీ 25, క్యారెట్ 40, దొండ 35, గుండుబీన్స్ 125, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 21, దోసకాయ 35, బీట్‌రూట్ 31, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 37, చామగడ్డ 45, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 17, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మైనారిటీల సమస్యల్ని పరిష్కరించాలి


ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌ను సన్మానిస్తున్న షేక్‌గౌస్

సనత్‌నగర్: ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌తో బేగంపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత షేక్‌గౌస్ భేటీ అయ్యారు. అబిడ్స్‌లోని ఆయన కార్యాలయంలో అమీర్ అలీఖాన్‌ను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. షేక్‌గౌస్‌తోపాటు నాయకులు సిద్దిక్‌ఖాన్, నసీర్, అడ్డూ తదితరులు ఉన్నారు.

మహిళలకు 50 శాతం స్కాలర్‌షిప్‌తో శిక్షణ

సనత్‌నగర్: టెక్ మహీంద్రా ఫౌండేషన్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా టెక్ మహీంద్రా స్మార్ట్ అకాడమీ(హైదరాబాద్) తరఫున నిరుద్యోగ యువతకు 'సప్లై చైన్ మేనేజ్‌మెంట్, వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో స్కాలర్‌షిప్‌తో కూడిన ప్లేస్‌మెంట్ సహకారం అందిస్తున్నట్లు ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిగ్రీ, పీజీ అర్హతలున్న 19 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సున్న యువతీ యువకులు స్కాలర్‌షిప్‌తో కూడిన ప్లేస్‌మెంట్ సహకారం ఉంటుందని చెప్పారు. ఈ నెలాఖరులో ప్రారంభం కానున్న కొత్త బ్యాచ్‌లో మహిళా అభ్యర్థులకు 50 శాతం స్కాలర్‌షిప్ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో ఉన్న టెక్ మహీంద్రా స్మార్ట్ అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ కార్యాలయంలో గానీ, 73373 32606లో సంప్రదించాలని కోరారు.

బాల్యవివాహాలపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా' స్వచ్ఛంద సంస్థలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్: బాల్యవివాహాల నిషేధ చట్టం -2006ను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మకమైన తీర్పును 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా' భాగస్వామ్య స్వచ్ఛంద సంస్థలు స్వాగతించాయి. సికింద్రాబాద్ బోలక్‌పూర్‌లోని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంస్థ డైరెక్టర్ ఎస్.నాగరాజ్, అశ్రయ్ బాలతేజస్సు సంస్థ డైరెక్టర్ నవీన్‌రాజ్, జననీ ఫౌండేషన్ డైరెక్టర్ ఆర్.మల్లేష్, రెయిన్‌బో ఫౌండేషన్ ప్రతినిధి క్రాంతికిరణ్, పీహెచ్‌సీ సంస్థ ప్రతినిధి బి.సంతోష్, ఆశ్రిత కో–ఆర్డినేటర్ మాధవి, పర్వతాలు తదితరులు మాట్లాడారు. బాల్యవివాహాలు ఆడపిల్లల హక్కులను హరిస్తాయని, వారు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛను కోల్పోతారని అన్నారు. బాల్యవివాహాలను అరికట్టడం సామాజిక బాధ్యతగా అందరూ భావించాలని కోరారు. 2030 నాటికి భారత్ చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ దేశంగా తీర్చిదిద్దడానికి ఈ తీర్పు ఎంతో దోహదపడుతుందన్నారు. 200కు పైగా స్వచ్ఛంద సంస్థల కూటమిగా ఏర్పడిన చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా ద్వారా 2023–24లో దేశవ్యాప్తంగా లక్షా 20 వేల బాల్య వివాహాలను అడ్డుకున్నామని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు సమాచారం ఉంటే ప్రజలు 1098, లేదా 100 కంట్రోల్ రూమ్‌కు కాల్ చేసి చెప్పాలని కోరారు.

రాఘవ చైతన్యకు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్ విభాగం విద్యార్థి రాఘవ చైతన్యకు పీహెచ్‌డీ డిగ్రీ లభించింది. సూర్యాపేట జిల్లా పెనపహాడ్ మండలం మాసారం గ్రామానికి చెందిన ఆయన సీనియర్ అధ్యాపకులు, కామర్స్ డీన్ ప్రొ.చెన్నప్ప పర్యవేక్షణలో టాలెంట్ మేనేజ్‌మెంట్ ఆన్ ఎంపిరికల్ స్టడీ ఆఫ్ టాలెంట్ రేటెన్షన్ స్ట్రాటెజిస్ ఎట్ ఫార్మాస్యుటికల్ కంపెనీస్ ఇన్ తెలంగాణ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టర్ లభించింది. తన పరిశోధనకు సహకరించిన వారికి రాఘవ చైతన్య కృతజ్ఞతలు తెలిపారు.

కనకదుర్గ ఆలయంలో రాహుకాల పూజలు


పూజల్లో పాల్గొన్న మహిళలు

అమీర్‌పేట: అమీర్‌పేట కనకదుర్గ దేవి ఆలయంలో రాహుకాల పూజలు జరిగాయి. మంగళవారం సాయంత్రం జరిగిన పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతి వారం రాహుకాల ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణ అధికారి అంబుజ తెలిపారు.

శుభాకాంక్షలు


ప్రొ.కుమార్‌కు మొక్కను అందజేస్తున్న దృశ్యం

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ నూతన వైస్ చాన్స్‌లర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కుమార్‌ను మంగళవారం మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ వద్దె ఎల్లన్న ఆధ్వర్యంలో పలువురు విద్యార్థి నేతలు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 107 సంవత్సరాల ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రలో మొదటిసారిగా ఓ మాదిగ సామాజిక వర్గానికి చెందిన అధ్యాపకుడు వీసీగా రావడంతో ఎంతో గర్వించదగ్గ విషయమని అన్నారు. ప్రొఫెసర్ కుమార్‌కు వీసీగా అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వద్దె ఎల్లన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

బాలకృష్ణారెడ్డి, పురుషోత్తంలకు శుభాకాంక్షలు


విద్యామండలి చైర్మన్, వైస్ చైర్మన్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొ.పురుషోత్తంకు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఓయూ వీసీ ప్రొ.కుమార్ ఉన్నత విద్యామండలి కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలను చర్చించారు. విద్య మండలి చైర్మన్‌గా, వైస్ చైర్మన్ నియమితులైనందుకు వారికి అభినందనలు చెప్పారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

సనత్‌నగర్: బేగంపేట ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్ ఆక్రమణలను మంగళవారం తొలగించారు. నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ రాహుల్ హెగ్డే పర్యవేక్షణలో టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్ఐలు ఆనంద్‌కుమార్, శివరాజ్, ఆర్ఎస్ఐ అశోక్‌రెడ్డితో పాటు జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, టౌన్‌ప్లానింగ్ అధికారి సుష్మిత ఆధ్వర్యంలో సిబ్బంది ఆపరేషన్ రోప్ పేరిట ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. బేగంపేట ఎయిర్‌లైన్స్ కాలనీ నుంచి కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫుట్‌పాత్‌పై వెలిసిన డబ్బాలు, ఇతరత్రా ఆక్రమణలను తొలగించారు. అయితే తమ వ్యాపారాలను దెబ్బతీస్తున్నారంటూ చిరువ్యాపారులు లబోదిబోమంటున్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం

జనాభా ప్రకారం పెంచాలని పీఎంకు లింగంగౌడ్ లేఖ

ఉస్మానియా యూనివర్సిటీ: ఈడబ్ల్యూఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్ల అమలు వల్ల బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ప్రధాని నరేంద్ర మోదీకి మంగళవారం ఈ మెయిల్ ద్వారా లేఖ రాశారు. డీఎస్సీ టీచర్ ఉద్యోగాల్లో తక్కువ మార్కులు వచ్చిన ఓసీ అభ్యర్థులకు ఉద్యోగాలు లభించాయని, ఎక్కువ మార్కులు తెచ్చుకున్న బీసీలకు ఉద్యోగాలు రాలేదని ఆయన వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన 2024 డీఎస్సీ పరీక్షలో ఎస్‌జీటీ ఉద్యోగాల్లో ఓసీలకు మహిళ విభాగంలో 62.97 మార్కులకు కటాఫ్ అయితే బీసీ–డీ అభ్యర్థులకు 69.43 మార్కులు వచ్చాయన్నారు. పురుషుల విభాగంలో ఓసీ అభ్యర్థికి 61.87 కటాఫ్ అయితే బీసీ–డీ అభ్యర్థికి 70.30 కటాఫ్ మార్కులు లభించినట్లు వివరించారు. రిజర్వేషన్లు ఇలానే కొనసాగితే బీసీలకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకని బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల సంఖ్య పెంచి న్యాయం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరినట్లు లింగంగౌడ్ పేర్కొన్నారు.

శరతులు లేకుండా రుణమాఫీ చేయాలి


రైతు సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ముషీరాబాద్: ఎలాంటి శరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, కరీఫ్ సీజన్‌కు రైతు భరోసా, అన్ని పంటలకు రూ.500 బోనస్ చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు మండల, జిల్లా కేంద్రాల్లో ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. మంగళవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన రైతు సంఘం సమావేశంలో సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి, ఉపాధ్యక్షులు రాము, ఎస్‌కే గౌస్, సహాయ కార్యదర్శులు దేవారామ్, భిక్షం, సీహెచ్ రాంచందర్, ఎస్.సురేష్, ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి



చిలకలగూడ: ఆటోడ్రైవర్ల అభ్యున్నతికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని, ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని హైదరాబాద్ జిల్లా ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు కొమురెల్లి బాబు డిమాండ్ చేశారు. మైలార్‌గడ్డ ఆటోస్టాండ్ నేతృత్వంలో వివిధ కారణాలతో మృతిచెందిన ఆటోడ్రైవర్ల సంతాపసభను దూద్‌బావి కమ్యూనిటీ హాలులో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా ఆటోడ్రైవర్ల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మృతి చెందిన ఆటోడ్రైవర్ల కుటుంబాలకు సంక్షేమబోర్డుతో ఆసరా లభించేదని, అది లేకపోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ కారణాలతో మృతి చెందిన నరహరి, వెంకటయ్య, రవి, సాగర్, కొమురయ్య, నూర్‌బాయ్, రమేష్ తదితరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మైలార్‌గడ్డ ఆటో యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షుడు జోగు రాములు, సికింద్రాబాద్ సీపీఐ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్, నాయకులు రమేష్, చందర్, కుమార్, యాదగిరి, బిక్షపతి, శ్రీనులతోపాటు మృతి చెందిన ఆటోడ్రైవర్ల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మైనారిటీల...

ఓయూలో కొమురం భీమ్ జయంతి


కొమురంభీమ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కొమురం భీమ్ 123వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఓయూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో ఫూలే–అంబేద్కర్ భవనం ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వీసీ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన పోరాట స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ మంగుతోపాటు ఇతర అధికారులు, అధ్యాపకులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

నీటి సరఫరా వేళల మార్పుతో ఇబ్బందులు


జీఎం వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: నీటి సరఫరా సమయాన్ని మార్చడం వల్ల డివిజన్‌లోని పలు బస్తీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి హంసరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మారేడుపల్లిలోని జలమండలి జీఎం వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హంసరాజు మాట్లాడుతూ అడ్డగుట్ట డివిజన్‌లోని ఎ, బి, సి, డి సెక్షన్లతోపాటు తుకారాంగేట్‌లోని పలు ప్రాంతాల్లో గత నెల రోజులుగా నీటి సరఫరా వేళలు మారాయని పేర్కొన్నారు. దీంతో లోప్రెషర్‌లో నీరు సరఫరా అవుతోందని తెలిపారు. దీనివల్ల స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల గతం మాదిరిగానే యథావిధిగా నీటి సరఫరా చేయాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు పి.లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

గాంధీ ఈఎన్‌టీ విభాగానికి పతకాల పంట


గాంధీ ఈఎన్‌టీ వైద్యులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర్‌రావు

గాంధీఆస్పత్రి: సౌత్‌జోన్ ఈఎన్‌టీ 19వ కాన్ఫరెన్స్, అసోషియేషన్ ఆఫ్ ఓటోలారింగోలజిస్ట్స్(ఏఐఓ) సదస్సులో గాంధీ ఈఎన్‌టీ విభాగ వైద్యులు, వైద్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి పతకాల పంట పండించారు. నగరంలోని ఓ రిసార్ట్‌లో మూడు రోజులపాటు జరిగిన సదస్సులో బెస్ట్ సర్జికల్ వీడియో ప్రజెంటేషన్, బెస్ట్ పేపర్ బై సీనియర్ టీచింగ్ ఫ్యాకల్టీ విభాగాల్లో గాంధీ ఈఎన్‌టీ హెచ్ఓడీ ప్రొఫెసర్ భూపేందర్‌సింగ్ రెండు గోల్డ్ మెడల్స్ సాధించగా, ఫైనల్ ఇయర్ పీజీ విద్యార్థినీ డాక్టర్ సౌజన్యనాయక్ రెండు కేటగిరీల్లో గోల్డ్ మెడల్స్ సాధించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ రేవతి, ఫైనల్ ఇయర్ పీజీ విద్యార్థినీ డాక్టర్ రమణి మానస టెంపోరల్ బోన్ డిసెక్షన్ అనే అంశంపై సెకండ్ ప్రైజ్ గెలుచుకున్నారు. క్విజ్, కేస్ సిరీస్ అంశాల్లో డాక్టర్ లోచన, శిల్ప ఫస్ట్, సెకెండ్ ప్రైజ్‌లు గెలుచుకున్నారు. అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన గాంధీ ఈఎన్‌టీ హెచ్‌వోడీ భూపేందర్‌సింగ్ రాథోడ్‌తోపాటు వైద్యులు, వైద్యవిద్యార్థులను గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర్‌రావు అభినందించి సర్టిఫికెట్లను అందించారు.

కోల్‌కతా హత్యాచార నిందితులను శిక్షించాలి


పార్సిగుట్టలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

ముషీరాబాద్: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై హత్యాచారం జరిగి 72 రోజులు గడుస్తున్నా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ అన్నారు. పార్సిగుట్ట, అంబర్‌నగర్‌లో ఇఫ్టు, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీబీఐ దర్యాప్తు సత్వరం పూర్తి చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అరుణ, రాజమణి, మణక్క, సుజాత, పుష్పలీలా, మంజుల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

చెత్త రిక్షాల పంపిణీ


రిక్షాలను అందజేస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలందరూ తమవంతుబాధ్యతాయుతంగా ఉండాలని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. మంగళవారం బౌద్ధనగర్‌లో శానిటేషన్ సిబ్బందికి చెత్త సేకరణ రిక్షాలను కార్పొరేటర్ కంది శైలజ అందజేశారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దని, చెత్త తరలింపు వాహనాలు, రిక్షాల్లోనే చెత్తను పారబోయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జవాన్ రాజు, సూపర్‌వైజర్లు యాదగిరి, శ్రీకాంత్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి


హరిత (ఫైల్)

ఉప్పల్: అనుమానాస్పద స్థితిలో డీఎస్ఎల్ మాల్ 9వ అంతస్తు నుంచి కిందపడి ఓ యువతి మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేట ప్రాంతానికి చెందిన పిన్నపాటి రమేష్ చిన్న కుమార్తె హరిత(24) ఉప్పల్ డీఎస్ఎల్ ఐటీ భవనంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తుంది. రోజూ సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకు ఉద్యోగం. కాగా 21న యథావిధిగా ఉద్యోగానికి వెళ్లింది. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో హరిత టీమ్ లీడర్ తండ్రి రమేష్‌కు ఫోన్‌చేసి మీ కుమార్తె భవనం నుంచి కింద పడిందని, ఆసుపత్రికి తరలించినట్లు తెలిపింది. తండ్రి ఆసుపత్రికి వెళ్లేసరికి అప్పటికే ఆమె మృతి చెందింది. దీంతో అతడు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని విచారణ జరిపించాలని కోరారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

చీకట్లు.. ఇక్కట్లు!

మాణికేశ్వర్‌నగర్‌లో వెలగని వీధిదీపాలు


మాణికేశ్వర్‌నగర్‌లో అలముకున్న చిమ్మ చీకట్లు

లాలాపేట: తార్నాక మున్సిఫల్ డివిజన్ పరిధిలోని మాణికేశ్వర్‌నగర్‌లో దాదాపు పది రోజుల నుంచి వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో చీకటి పడితే చాలు.. వడ్డెర బస్తీవాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు బయటికి రావడానికి జంకుతున్నారు. మాణికేశ్వర్‌నగర్ ఫేజ్ 2లో చాలా రోజులపాటు వీధిదీపాలు పనిచేయకపోయినా సంబంధిత అధికారులు, సిబ్బంది పత్తా లేరని మాణికేశ్వర్‌నగర్‌వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

అయోడిన్‌పై అవగాహన ర్యాలీ

ఉప్పల్: అయోడిన్ విరివిగా ఉండే పదార్థాలను తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అయోడిన్ లోపం వల్ల అనేక రుగ్మతలు దరి చేరుతాయని అయోడిన్ లోపం రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డాక్టర్లు ప్రచారం నిర్వహించారు. ఈ ర్యాలీ ఉప్పల్ పీహెచ్‌సీ నుంచి ప్రారంభమైంది. డా.మల్లేశ్వరి, డా.భాను, విజయ్‌కుమార్, బోగ ప్రకాష్, మహేష్‌గౌడ్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.